నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నార్త్ బాలాజీ హిల్స్, రాజశేఖర్ కాలనీ, సూర్యహిల్స్, నవోదయ కాలనీ, ఈదయ్యనగర్, న్యూహేమానగర్, హేమానగర్, న్యూరాంనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వాసవీనగర్, మల్లయ్యనగర్, గాయత్రీహిల్స్, రెడ్డీస్ కాలనీ, తిరుమల మెడోస్, హేమానగర్ కాలనీల్లో 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు దేవేందర్‌నగర్, అంబేద్కర్‌నగర్, గౌతమీనగర్, రాజీవ్‌నగర్, జ్యోతినగర్ కాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆర్ఎన్ఎస్ ఫీడర్ పరిధిలో శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ వెల్లడించారు. ఆర్ఎన్ఎస్ కాలనీ, ఆర్ఎన్ఎస్ రాయల్ కాలనీ, ఆర్ఎన్ఎస్ డ్రీమ్ హోమ్స్, ఆర్ఎన్ఎస్ ఫేస్ 3, అన్నపూర్ణ కాలనీ, పద్మా వతి కాలనీ, ఆంజనేయ ఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ, బీఎల్‌నగర్, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, సాయినగర్‌కాలనీ, కమలానగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని ఆశోక్‌నగర్, అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్, ఆశోక్‌నగర్, హెచ్‌సీఎల్ కేబుల్, చౌరస్తా, మర్రిగూడ, జనప్రియ టవర్స్, సాయిటవర్స్, మోడీ టవర్స్, అన్నపూర్ణ కాలనీ, లింగమయ్య నగర్ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని, వినాయకనగర్, సఫిల్‌గూడ, దీన్‌దయాళ్‌నగర్, సుధానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ క్రిస్టినా తెలిపారు.

ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ కల్పించినట్లు కమిషనర్ శైలజ వెల్లడించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఉత్తర్వుల మేరకు ఈ రాయితీని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రాయితీ పొందేందుకు యజమానుదారులు 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను, బకాయిలను పూర్తిగా ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలన్నారు. 5 శాతం రాయితీ కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం యజమానుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేనన్నారు. ఆస్తిపన్ను ఆన్‌లైన్ ద్వారా, బిల్ కలెక్టర్లకు, మున్సిపల్ పౌరసేవా కేంద్రం నుంచి గానీ చెల్లించి రాయితీని పొందాలన్నారు. మరింత సమాచారం కోసం రెవెన్యూ విభాగంలో లేదా పౌర సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అబ్దుల్ హక్(ఫైల్)

మల్కాజిగిరి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ వాహీద్ ప్లంబర్. అతడి కుమారుడు షేక్ అబ్దుల్ హక్(20) శుక్రవారం తన బైక్ మీద స్పీడ్‌గా వెళ్తూ మౌలాలి వద్ద ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న 108 సిబ్బంది హక్ మృతి చెందాడని నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా...

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పి.సూర్య(25), నరేష్ గురువారం మధ్యాహ్నం మచ్చబొల్లారం సంజీవరెడ్డినగర్‌లో నివాసముండే స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా మచ్చబొల్లారం బాలాజీ హైస్కూల్ వద్ద ఎదురుగా వెళ్తున్న ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొటింది. దీంతో సురేష్ కుడివైపు రోడ్డుపై పడిపోగా వెనుక కూర్చున్న సూర్య ట్యాంకర్ చక్రాల కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలు కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు

- ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా వెలుస్తున్న నిర్మాణాలు
- రాత్రి వేళలో నిర్మాణాల పూర్తి
- తూతూ మంత్రంగా కూల్చివేతలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మండల రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వ స్థలం కనపడితే కబ్జాదారుల చేతుల్లోకి పోతున్నాయి. కబ్జా చేసిన ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతూ పేద ప్రజలకు లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. సదరు కబ్జాదారులపై మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా కూల్చివేతలు చేడుతున్నారు. దీంతో స్థానిక ప్రజల నుంచి మండల రెవెన్యూ అధికారులపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది మాజీ కార్పొరేటర్లు, వారి భర్తలు వీటిని ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. – బోడుప్పల్


గౌతమినగర్‌లో అక్రమ నిర్మాణాలు

- సర్వే నంబర్ 63/1లో దేవేందర్‌నగర్ కాలనీ ఉంది. ఇందులోని ప్రభుత్వ పాఠశాల, వాటర్ ట్యాంక్ వద్ద పెద్దగుట్ట ఉంది. దీనిని తవ్వి 2 వేల గజాల స్థలాన్ని నాలుగు మాసాల క్రితం చదును చేశారు. కొంత మందికి 60 గజాల చొప్పున రూ.7 లక్షలకు విక్రయించారు. వారు నిర్మాణాలు చేపడుతుండగా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని జేసీబీతో కూల్చివేశారు. మళ్లీ ఇప్పుడు అదే స్థలంలో గుడిసెలు వేశారు.
- సర్వే నంబర్ 63/1లోని రాజీవ్‌నగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద పెద్ద గుట్ట ఉంది. 2023 సంవత్సరం జనవరి మాసంలో జేసీబీతో గుట్టను తొలగించారు. అందులో 60 గజాల చొప్పున 11 ప్లాట్లు చేశారు. అందులో కొంత మంది వ్యక్తులు బేస్‌మెట్స్ చేపడుతున్నారు. అధికారులు వాటిని కూల్చివేస్తున్నారు. మరలా చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు.
- సర్వే నంబర్ 63/26 నుంచి 63/39లో గౌతమీనగర్ నగర్ ఉంది. 1980 సంవత్సరంలో కాలనీ ఏర్పడింది. తరువాత ఇది ప్రభుత్వ స్థలమని అధికారులు, ప్రవేట్ స్థలమని స్థల యజమానులు చెబుతున్నారు. ఈక్రమంలో స్థల యజమానులను ఇళ్లు కట్టుకోకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. అధికారులు, స్థల యజమానులు కోర్టుకు వెళ్లారు. సదరు స్థలంపై కోర్టు స్టేటస్ కో విధించింది. దీంతో అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు. కాంగ్రెస్ పార్టీ హయాంలో గౌతమీనగర్‌లోని బిస్కెట్ గోడౌన్ వద్ద 1,200 గజాల స్థలాన్ని కబ్జా చేశారు. 100 గజాల చొప్పున రూ.7 లక్షలకు ఒక్కొక్క ప్లాట్ విక్రయిస్తున్నారు. కొన్ని వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే మూడు నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టారు.

అధికారులూ.. కబ్జాదారుల మిలాఖత్..

మేడిపల్లి మండల రెవెన్యూ అధికారులు, కబ్జాదారులు మిలాఖత్ అయి ప్రభుత్వ స్థలాలను కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి. స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పట్టించుకోకుండా ఉండేందుకు ఒక్కొక్క నిర్మాణానికి రూ.లక్ష తీసుకుంటున్నట్లు స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టి మళ్లీ నిర్మించుకోవాలని చెబుతున్నారు.

> **ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం**
>
> బోడుప్పల్‌లో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి చేస్తున్నాం. నిత్యం పర్యవేక్షిస్తూ నిర్మాణాలు జరగకుండా చూస్తున్నాం. ఎవరైనా రాత్రి పూట నిర్మాణాలు చేపడితే వెంటనే జేసీబీతో కూల్చివేస్తున్నాం. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నాం.
>
> – హసీనా, తహసీల్దార్, మేడిపల్లి



ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలి


చైతన్య బస్సు యాత్రకు బయలుదేరిన ఉద్యమకారులు

మౌలాలి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారులు కోరారు. ప్లీనరీ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చైతన్య బస్సు యాత్రలో భాగంగా ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రకు మౌలాలి నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న సికింద్రాబాద్‌లో ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చీమ శ్రీనివాస్, పటోళ్ల సురేందర్‌రెడ్డి, వీరస్వామి, కొండ స్వామి, గగన్‌కుమార్, జానకీరెడ్డి, మల్లారి అనిల్, జ్యోతిరెడ్డి, దయానంద్, యాదిరెడ్డి, అనంతలక్ష్మి, శ్యామల, భూపాల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

మౌలాలి: ఈశ్వర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంశీ ముదిరాజ్, కాలనీవాసులు నాగరాజ్‌గౌడ్, బాల్‌రెడ్డి, అలుగారయ్య, ఎడ్వర్డ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల వసంత నవరాత్రి ఉత్సవాలు



అల్వాల్: సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు అల్వాల్‌లో ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కళాభారతి శిష్య బృందం నిర్వహించిన భరత నాట్యం ఆకట్టుకుంది. ఉదయం కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి పార్వతీ కల్యాణం హరికథ కాలక్షేపం నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం

మల్కాజిగిరి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తిరెడ్డి నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ(73) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. మద్యానికి బానిసైన ఆయన గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం అతడి భార్య కౌసల్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన లారీ డ్రైవర్‌కు ఆర్థిక సాయం

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్‌కు అల్వాల్ లారీ డ్రైవర్ అసోసియేషన్ వారు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్ విజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఆయనను పరామర్శించిన అసోసియేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బలవంతరెడ్డి తెలిపారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

బోడుప్పల్: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, ప్రైమరీ విద్యార్థులకు ఫన్నీ గేమ్స్ నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ..

మల్లాపూర్: వక్ఫ్ బోర్డు బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై బీజేపీ శ్రేణులు శుక్రవారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ముత్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దొడ్డి యాదగిరి, రామచంద్ర, నరసింహ, రవిగంగాధర్, లింగంగౌడ్, వెంకటేష్, రామయ్య, నరసింహరెడ్డి, తిరుపతిరెడ్డి, మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన చెట్టు


ఆర్టీసీ కాలనీలో కూలిపోయిన భారీ చెట్టు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారిలోని పురాతన చెట్టు కూలిపోయి సమీపంలో ఉన్న ఇంటిపై పడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానిక సంక్షేమ సంఘం నేతలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి


రైల్వే ట్రాక్ సమీపంలో డ్రైనేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత, అధికారులు

గౌతంనగర్: గౌతంనగర్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ ప్రాంతాన్ని శుక్రవారం కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, జలమండలి, జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌతంనగర్ రైల్వే ట్రాక్ సమీపంలో నిరంతరం రోడ్డుపై పొంగిపొరుతున్న డ్రైనేజీతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఇరువైపులా పైపుల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, జలమండలి ఏఈ నవీన్, జీహెచ్ఎంసీ ఏఈ దివ్యజ్యోతి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రామంతాపూర్, నెహ్రూనగర్, ఇందిరానగర్‌లో రూ.85 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి 100 శాతం కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో డివిజన్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలోనే పెండింగ్ పనులను కూడా పూర్తిచేసే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల మహేందర్, పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకోం..


ఉప్పల్‌లో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్‌ను ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమానిస్తే సహించేది లేదని పలువు కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కో– ఆర్డినేటర్ శోభారాణి మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అమిత్‌షా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ జైబాపు, జైభీం, జైసంవిధాన్ నినాదాన్ని ముందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. హోంమంత్రి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని సూచించారు. బీజేపీ దాని అనుబంధ సంస్థల దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందముల రజిత, బొంతు శ్రీదేవి, నేతలు తౌఫిక్, అంజిరెడ్డి, రాజేందర్, ధన్‌పాల్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవ వేడుకలు


కల్యాణ మహోత్సవ కరపత్రికను ఆవిష్కరిస్తున్న మంజుల రమేష్‌యాదవ్

బోడుప్పల్: సాయిభవానీ నగర్ కాలనీలోని స్పటిక లింగేశ్వర సహిత సీతారామాంజనేయ ఆలయంలో ఈ నెల 6వ తేదీన సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జిడిగె మంజుల రమేష్‌యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా బోడుప్పల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారికి మహాభిషేకం, 8గంటలకు పూజ, 10.30 గంటలకు ఎదుర్కోలు, 11గంటలకు శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం, 12.30 గంటలకు మహా నైవేద్యం నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రాహుల్ శర్మ పాల్గొన్నారు.

కారిడార్ నిర్మాణ పనులు.. ఇంకెన్నాళ్లు..?


ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్షం నేతలు

ఉప్పల్: ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటాన్ని నిరసిస్తూ ఉప్పల్ అఖిలపక్షం ఆధ్వర్యంలో నేతలు, స్థానికులు, వివిధ పార్టీల నేతలు, వర్తక సంఘం నేతలు, ఉప్పల్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఆరేళ్లుగా ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం దుమ్ముధూళితో అనేక మంది రోగాలతో ఇబ్బంది పడుతున్నారని, త్వరగా కారిడార్ పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మేకల శివారెడ్డి, అఖిలపక్షం నాయకులు మేకల మధుసూదన్‌రెడ్డి, మేకల హన్మంత్ రెడ్డి, కందికంటి అశోక్ గౌడ్, బజారు గజన్నాథ్, మహంకాళి నర్సింహ, జెల్లి మోహన్ దాస్ గౌడ్, సుధాకర్ గుప్తా, బింగి భరత్, నెర్ధం భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో భూముల వేలం ఖండిస్తున్నాం

అల్వాల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) పరిధిలోని 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందని, ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉందన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను విడుదల చేసి వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూముల అమ్మకం నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

అగ్ని ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు దగ్ధం




మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన నర్సింహులు అతడి భార్య శుక్రవారం ఉదయం పనికి వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత వారు ఉన్న ఇంటి నుంచి పొగ, మంటలు రావడం గమనించి ఇంటి పక్కన ఉన్న వారు మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లోని టీవీ, ఫ్రిజ్ ఇతర సామాన్లు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని నర్సింహులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పరిహారం చెల్లించాలని కార్పొరేటర్ నిరసన

మల్కాజిగిరి: నాలా నిర్మాణంలో నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల జాప్యాన్ని నిరసిస్తూ మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ చీఫ్ సిటీ ప్లానర్ చాంబర్ వద్ద పడుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా నిర్మాణం సందర్భంగా ఆస్తులు కోల్పోయారని ఏడాది కాలంగా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతిమయంగా మారిందని, కేవలం బడా బిల్డర్స్‌కు పనిచేయడమే తప్ప సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పనులు చేయడం లేదన్నారు. త్వరలోనే పరిహారం అందజేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గ్రూప్–1 ర్యాంకర్ శాంతన్‌కుమార్‌కు సన్మానం



కాప్రా: ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో 30వ ర్యాంక్ సాధించిన శాంతన్‌కుమార్‌రెడ్డిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంక్, మల్టీ జోన్‌లో 12వ ర్యాంక్ సాధించడం పట్ల కమలానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శాంతన్‌కుమార్ తల్లిదండ్రులు రవీందర్‌రెడ్డి, గీతను అభినందించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571